క్లుప్తంగా

ఏఈగా రఫిక్ మహమ్మద్



మద్దికెర: స్థానిక సబ్‌స్టేషన్‌కు రెగ్యులర్ ఏఈగా రఫిక్ మహమ్మద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇన్‌చార్జి ఏఈగా మహేష్ రెడ్డి ఉండేవారు. రెగ్యులర్ ఏఈని నియమించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లడంతో కర్నూలు నుంచి బదిలీపై రఫిక్ మహమ్మద్‌ను నియమించారు.

శ్రీచక్ర నవావరణార్చన పూజలు



శ్రీచక్ర పూజలో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరుటౌన్: అధిక శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలో ఆర్య వైశ్య సంఘం, వాసవీ పూజా సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవి కళ్యాణ మండపంలో బుధవారం శ్రీచక్ర నవావరణార్చన ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు భార్గవస్వామి నేతృత్వంలో జరిగిన పూజా కార్యక్రమాలతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి అష్ట ఐశ్వర్యములు ఇష్టార్థ సిద్ధి, సంతానప్రాప్తి, శత్రుబాధనివృత్తి, ధనధాన్యాభివృద్ధి ప్రాప్తిస్థాయని వాసవిపూజా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తక్కశిల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును చూపుతున్న ఈఎంటీ

హొళగుంద: మండల కేంద్రంలోని 7వ వార్డుకు చెందిన ఫిరదౌసి అనే నిండు గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు రావడంతో సుఖ ప్రసవం జరిగేలా సిబ్బంది చికిత్స అందించారు. వివరాలు.. బుధవారం తెల్లవారుజామున ఫిరదౌసికి పురిటినొప్పులు రావడంతో ఆశ కార్యకర్త జయలక్ష్మి వెంటనే అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. గర్భిణిని అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు మెరుగైన చికిత్సకు రెఫర్ చేశారు. దీంతో ఫిరదౌసిని ఆదోని ఎంసీహెచ్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా నెరణికి- ముద్దనగేరి మధ్యలో నొప్పులు తీవ్రమయ్యాయి. ఈఎంటీ కె.యల్లయ్య సహకారంతో ఆమెకు ప్రసవం జరిగింది. శిశువు పేగు మెడకు చుట్టుకుని రావడంతో జాగ్రత్తగా కాన్పు చేశారు. అనంతరం తల్లీబిడ్డను ఆదోని ఎంసీహెచ్‌లో చేర్చారు. ఫిరదౌసికు ఇది మొదటి కాన్పు కాగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

త్యాగధనులను స్మరించుకోవాలి



స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

గోనెగండ్ల: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారిని మరువరాదని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు, పెద్దమరివీడు గ్రామాల్లో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ స్థూపాన్ని నిర్మించారు. స్థూపాన్ని జిల్లా అధికారులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులు, దేశభక్తిని గూర్చి విద్యార్థులకు వివరించారు. దేశాభివృద్ధిలో తన వంతు పాత్ర నిర్వహిస్తానని, దేశ ఐక్యత, ఐక్యమత్యం కోసం కృషి చేస్తానని, దేశం పట్ల విధులు బాధ్యతలు నిర్వహిస్తామని, త్యాగధనుల త్యాగాన్ని గౌరవిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, ఏపీడీ అల్లీపీరా, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, ఈసీ ఉస్మాన్, సర్పంచులు హైమవతి, బాషా తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై మెరుపుదాడి

కృష్ణగిరి: మాదాపురం గ్రామ శివారులోని చౌడు పొలాల్లో పేకాట స్థావరంపై బుధవారం సాయంత్రం పోలీసులు మెరుపుదాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.29,630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆర్.సురేష్ తెలిపారు. 10 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. ఐదుగురు పరారయ్యారని వారిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి పంట నమోదు

దేవనకొండ: రైతులు పంటల నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సురేష్‌బాబు సూచించారు. ఆయన బుధవారం ఆయన వ్యవసాయ సిబ్బందికి పంటల నమోదు కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. గురువారం నుంచి పంటల నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రతిరైతు పొలం వద్దకు వెళ్లి జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పంటల నమోదు చేయాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తితే తనదృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి గుమ్మనూరు జయరాం
- మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే
- 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా సమస్యల పరిష్కారం



శిరుగాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

హాలహర్వి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట గ్రామ సచివాలయం-2 పరిధిలోని శిరుగాపురం గ్రామంలో బుధవారం ఎంపీడీఓ ఆంతోనీ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు గజమాలలతో స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.3.40 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులతో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని మరోసారి వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీలను చిత్తుగా ఓడించి జగనన్నను మరోసారి అధికారంలోకి తీసుకొస్తారని పేర్కొన్నారు. మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, కబీర్‌దాస్, రాజారెడ్డి, సహదేవుడు, జయరాం, తువ్వదొడ్డి మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అరుణ్‌కుమార్, నిజాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికారం పగటికలే

ఆలూరు: విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్రలు చేస్తున్నారని మంత్రి గుమ్మనూరు జయరాం ఆరోపించారు. గత పాలనలో అన్ని వర్గాల వారిని మోసగించడంతో ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పారని, మళ్లీ చంద్రబాబు అధికారం చేపట్టడమనేది పగటి కలే అవుతుందన్నారు. హాలహర్వి మండలం చింతకుంట గ్రామ సచివాలయం-2 పరిధిలోని శిరుగాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రాంతాలవారీగా కిరాయి మూకలను దింపి అల్లర్లు, దాడులు చేసేలా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆ పార్టీకి రానున్న ఎన్నికల్లో రాజకీయ సమాధి తప్పదని జోస్యం చెప్పారు.

ఓటరు సర్వే పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో ఓటరు సర్వే పక్కాగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నాసర రెడ్డి సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సూపర్ వైజర్లు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీ వరకు చేపట్టే ఓటరు వెరిఫికేషన్ సర్వేలో బీఎల్‌ఓలు పాల్గొని గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఓటరు నమోదు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగింపు సక్రమంగా చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఓటరు నమోదు దరఖాస్తులు 2,096 వచ్చాయని, పెరిగిన జనాభా ప్రకారం మరో 18 వేల వరకు అర్హులైన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. బీఎల్‌ఓలు చేసే సర్వేను పర్యవేక్షించాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా సక్రమంగా సర్వే చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో నుంచి తొలగించేలా ఇప్పటికే వివరాలు అందించామని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య అన్నారు. స్పందించిన సీఈఓ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్, నిత్యానందరాజు, ఎన్నికల డీటీ గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



స్కానింగ్ పరీక్షల కోసం బారులుతీరిన గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్య క్రమంలో భాగంగా బుధవారం ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో గర్భిణులు తరలివచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల కోసం పెద్ద సంఖ్యలో గర్భవతులు వచ్చారు. 280 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు. పరీక్షల కోసం వచ్చిన వారు కూర్చునేందుకు కుర్చీలు, టెంట్ తదితర ఏర్పాట్లు చేశారు. డాక్టరు మైత్రేయి, డాక్టర్ ఫాతీమా తదితరులు వైద్య పరీక్షలు చేశారు.

గర్భిణులకు అన్నదానం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు బుధవారం మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులు హరి, కరీముల్లా, ప్రసాద్, రాజు రాజశేఖర్, నందిశ్రీను తదితరులు మాట్లాడుతూ.. అన్నదాన కార్యక్రమం ప్రతి నెలా కొనసాగుతుందని తెలిపారు. గర్భిణులతో పాటు వారికి సహాయంగా వచ్చినవారు భోజనం చేశారు.

ప్రకృతి సాగుపై దృష్టి పెట్టాలి



రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెడ్యూలు కులాలకు చెందిన నియోజకవర్గ పరిధిలోని 369 మంది రైతులకు రూ.3.69 కోట్ల విలువైన విత్తన కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా ప్రతి రైతుకు రూ.10 వేలు విలువైన విత్తన కిట్లు అందజేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు. ఎంపీపీ నారాయణదాస్, సర్పంచు కొమ్ముదీపిక, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

తుగ్గలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లి, బాటతండా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక స్థితి మెరుగవుతుందన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, బాలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాందాస్‌నాయక్, జగన్నాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, జిట్టా నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నామినేషన్లు



కుందనగుర్తిలో నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి కొండా రేణుక

చిప్పగిరి: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో ఖాళీగా ఉన్న ఏరూరు గ్రామంలోని 5వ వార్డు, కుందనగుర్తి గ్రామంలోని 7 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా రెండవ రోజు బుధవారం కుందనగుర్తిలో ఒక నామినేషన్ దాఖలైంది. అభ్యర్థి కొండా రేణుకమ్మ నామినేషన్ దాఖలు చేసినట్లు కుందనగుర్తి రిటర్నింగ్ అధికారి బాలనాయుడు తెలిపారు. ఏరూరులో ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని కృష్ణాపురం పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న 10వ వార్డు మెంబర్ స్థానానికి సిద్ధినగట్టు గ్రామానికి చెందిన మాదాసు మహేశ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశాడు. ఈ మేరకు నామినేషన్‌ను పత్రాలను కృష్ణాపురం పంచాయతీ కార్యాలయంలో ఆర్‌ఓ సురేంద్రనాథ్ రెడ్డికి అందించాడు. ఇదిలాఉండగా మండలంలో మిగిలిన ఎల్.నగరం, బొమ్మిరెడ్డిపల్లె, కలుగొట్ల పంచాయతీలలో ఖాళీగా ఉన్న ఒక్కో వార్డు మెంబర్ స్థానానికి ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు కాలేదని ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు గురువారం ఆఖరు అని వెల్లడించారు.

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామ పంచాయతీలో ఏడవ వార్డు మెంబర్ స్థానానికి బుధవారం మడ్డి జయమ్మ నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రఘునాథ్ తెలిపారు. ఈ స్థానానికి ఇదే తొలి నామినేషన్ అని చెప్పారు.

పంటకోత ప్రయోగాలతో ప్రయోజనం



మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

గోనెగండ్ల: పంటకోత ప్రయోగాలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ హేమలత ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ వరలక్ష్మి, ఉపగణాంక అధికారి గంగన్న హాజరై మాట్లాడారు. పంటకోత ప్రయోగాల వల్ల దిగుబడి అంచనా వేయవచ్చని, పంటల బీమా, నష్ట పరిహారం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. వరి, పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి తదితర పంటలలో పంటకోత ప్రయోగాలు ఎలా చేపట్టాలో వివరించారు. అలాగే ఆర్బీకేల ద్వారా సెప్టెంబర్‌లోపు 2,964 మెట్రిక్‌టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం గోనెగండ్లలో నిర్మాణంలో ఉన్న ఆర్బీకే భవనాలను పరిశీలించారు. ఏడీఏ మహమ్మద్ ఖద్రి, ఏఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఉద్యానవన అధికారిణి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం పంటకోత ప్రయోగాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డివిజనల్, సహాయ గణాంక అధికారులు రవిప్రకాశ్, జానకి, ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎంపిక చేసిన గ్రామాలలో ఎస్‌బీఐ జనరల్ ఇన్‌స్రూ అధికారుల సమక్షంలో పంటకోత ప్రయోగాలు చేపట్టి అంచనాలు తయారు చేయాలన్నారు. తద్వారా రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందుతారని వివరించారు.

నందవరం: పంట కోత ప్రయోగాలు పక్కగా చేపట్టాలని ఆదోని డివిజన్ ఏఎస్‌ఓ గంగన్న సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మడ్డి స్రవంతి ఆధ్వర్యంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలకు పంట కోత ప్రయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌ఓ సూర్య ప్రకాష్, ఏఈఓ సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

విజేత ఎర్రబాలెం వీజీఆర్ బుల్స్

వెల్దుర్తి: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో మంగళవారం పాలపండ్ల ఎడ్ల విభాగంలో నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలలో విజేతలుగా ప్రకాశం జిల్లా ఖమ్మం మండలం ఎర్రబాలెం వీజీఆర్ బుల్స్ నిలిచి రూ.35 వేలు గెలుచుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు చెరుకులపాడు శివారెడ్డి ప్రారంభించారు. 25 జతల వృషభాలు పాల్గొన్న ఈ పోటీలలో ద్వితీయ స్థానంలో హైదరాబాద్ రోహన్‌బాబు వృషభాలు, మూడవ స్థానంలో గోనెగండ్ల పెద్దనేలటూరు సీతారాముడు వృషభాలు, నాలుగైదు స్థానాలలో దూశాన్ని సమాన దూరం లాగిన పంచలింగాల బైరపోగు బుల్స్, పాములపాడు మండలం తుమ్మలూరు పల్లవి వృషభాలు నిలిచాయి. విజేతలకు దాతలు, నిర్వాహకులు బహుమతులు అందించారు.

రాయలసీమను కాపాడుకుందాం

మద్దికెర: వెనకబడిన రాయలసీమను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మద్దికెరలో 'రాయలసీమ రచ్చబండ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీమ కు రావాల్సిన జలాల వాటా ఇవ్వాలని ఢిల్లీలో ప్రధానమంత్రికి విన్నవించామన్నారు. సీమలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

హక్కులను కాపాడుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని తహసీల్దార్ ఆంజినేయులు పేర్కొన్నారు. బుధవారం ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమల్లోకి తెచ్చాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మల్లెల గ్రూప్ అధినేత ఆల్‌ఫ్రెడ్‌రాజు, కృష్ణ గణేష్, బతకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

మద్దికెర: మండలంలో విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పత్తికొండ ఏడీ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినియోగదారులు, రైతులు విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుగ్గలి ఏఈ మహేష్‌రెడ్డి ఉన్నారు.

వేదావతి సామర్థ్యం పెంచాలి

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టును 8 టీఎంసీలతో నిర్మించి ఆస్పరి మండలానికి తాగు, సాగు నీరు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఐ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, రాజశేఖర్, కృష్ణమూర్తి నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

చుక్కల జాబితా నుంచి తొలగించాలి

గోనెగండ్ల: తన భూమిని చుక్కల భూముల జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని పెద్దనేలటూర్ మాజీ సర్పంచ్ ఈరన్న ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఈరన్న కుటుంబ సభ్యులతో తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. సమస్య పరిష్కరించాలని వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. సదరు భూమిపై కోర్టులో కేసు ఉండడంతో చుక్కల భూమి జాబితా నుంచి తొలగించలేమని రెవెన్యూ అధికారులు బదులిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నక్కలమిట్టలో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని నక్కలమిట్ట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఆర్థిక అడ్డంకులు వచ్చినా సీఎం జగనన్న ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నాడని కొనియాడారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, నాయకులు జాలవాడి లక్ష్మన్న, టి.బజారి, కె. గోవిందు, ఎం.రామాంజి, లింగన్న, జాలవాడి లక్ష్మి, శూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమ

మద్దికెర: అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ హెచ్చరించారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో.. అభివృద్ధి పనులు, నిధుల వినియోగం గురించి సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు జరుగుతున్నాయి, లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరవుతున్నాయా అని విచారించారు. పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్‌ఐ రవికుమార్, ఏఈలు ఉమాకాంత్, మయాంక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా నందవరం



నందవరం పోలీస్‌స్టేషను పరిశీలిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: దేశంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా నందవరం ఎంపికై నట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రహరీ నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, పెండింగ్ పనులను సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీస్‌స్టేషన్ల జాబితాలో నందవరంకు చోటు దక్కిందన్నారు. కేంద్ర హోం శాఖ 2023లో ఉత్తమ పోలీసుస్టేషన్ అవార్డులకు 10 స్టేషన్లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నెలలో కేంద్ర అధికారుల బృందం స్టేషన్‌ను పరిశీలించి ఉత్తమ స్టేషన్లను ఎంపిక చేస్తారని వివరించారు. అందులో భాగంగా స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలతో పాటు నేరాల నియంత్రణ చర్యల్లో సమర్థవంతంగా సేవలందించిన పోలీస్‌స్టేషన్లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎస్‌ఐ తిమ్మయ్య, కానిస్టేబుళ్లు ఉన్నారు.


కష్టాన్ని నమ్ముకొని.. పెట్టుబడి తగ్గించుకొని !



మిరప పైరులో అంతరసేద్యం చేస్తున్న దొల్తాపురం రైతులు కావలి రాజ్‌కుమార్, హనుమేష్

చిప్పగిరి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలలో అంతరసేద్యం కొరకు బాడుగ రూ.2 వేలకు పైగా అడుగుతుండడంతో కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి తమకు సరిపడే రీతిలో వ్యవసాయ పనిముట్లు తయారు చేసుకొని కడెద్దులకు తామేమి తక్కువ కాదనట్లుగా పొలాల్లో గుంటక లాగుతూ పెట్టుబడి భారాన్ని తగ్గించుకుంటున్నారు. బాడుగ ధర రూ.2 వేలకు పైగా ఉండడంతో ఇలా సొంతంగా అంతరసేద్యం చేస్తున్నట్లు దొల్తాపురం రైతులు కావలి రాజ్‌కుమార్, హనుమేష్ తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



పత్తికొండలో సివిల్ సప్లయి గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

ఆస్పరి: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం ఆస్పరి కస్తూర్బా పాఠశాల, బిణిగేరిలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ షాపును తనిఖీ చేశారు. బిణిగేరిలో డీలర్ గరీబ్ బాషా మాట్లాడుతూ.. పత్తికొండ స్టాక్ పాయింట్ నుంచి వచ్చే బియ్యం తూకాల్లో తేడాలు ఉంటున్నాయని సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. చివరగా కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ రంగారెడ్డి, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, తహసీల్దార్ కుమారస్వామి, డాక్టర్ రఘురామిరెడ్డి, సీడీపీఓ నిర్మలాదేవి ఉన్నారు.

పత్తికొండ రూరల్: సివిల్ సప్లయి గోడౌన్‌లో బియ్యం బస్తాలు తూకం వేసిన తరువాతనే డీలర్లకు ఇవ్వాలని చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి ఆదేశించారు. బుధవారం పత్తికొండలోని సివిల్ సప్లయి గోదామును పరిశీలించారు. డీలర్ల నుంచి వేలిముద్రలు నమోదు చేసుకుని కొలత ప్రకారం బియ్యం అందించాలని ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లుకు సూచించారు. సివిల్ సప్లయి జిల్లా ఇన్‌చార్జ్ షర్మిల వెంట ఉన్నారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-6ను తనిఖీ చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

తుగ్గలి: రాతన సమీపంలో గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను చైర్మన్ తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా విద్యార్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని సూచించారు.

ఎమ్మిగనూరురూరల్: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయికి చేరుకుంటారని విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని జూనియర్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఉండే హాస్టల్, బీసీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. హాస్టళ్లలో ఏమైనా సమస్యలుంటే తనకు ఫిర్యాదు చేయాలని, విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డీటీ గురురాజరావు, వీఆర్వో షేక్షావలి, వార్డన్ అజీజ్ తదితరులు ఉన్నారు.